కథా నిలయం
5478
శ్రీకాకుళం



# ట్రీట్‌మెంట్

*ఆంధ్రభూమి వీక్లీ.. 25 జూలై, 2002*



"అనూ..! మన ప్రేమను ఎవరూ విడదీయలేరు!"

"అవును సూర్యా! ఆ భగవంతుణ్ణి ఎదిరించైనా సరే... మనం ఒకటవ్వాలి!"

"మనం ఈ స్వార్థప్రపంచం నుండి దూరంగా పారిపోదాం... ఈ రాత్రికే!"

విసుగ్గా టీవీ ఆఫ్ చేశాడు ప్రసాదరావు.

అతడు ఆరునెలల క్రితం ఆఫీసు పనిమీద అమెరికా వెళ్లి క్రితంరోజే ఇండియాకి వచ్చాడు. వారంరోజుల తర్వాత అతను డ్యూటీలో జాయిన్ అవ్వాలి. ముందురోజు భార్యాపిల్లల్తో కబుర్లతో ఆనందంగా గడిపాడు.

ఈరోజు పిల్లలు కాలేజీలకు వెళ్లడంతో- బోర్‌గా ఫీలయి టీవీ ఆన్ చేశాడు. అయితే... అది అతని విసుగుని మరింత పెంచింది... "లక్ష్మీ! కాఫీ తీసుకురా..!" భార్యను కేకేశాడు.

లక్ష్మి కాఫీ తెచ్చి- "టీవీ ఆఫ్ చేసేశారేం? మంచి ప్రోగ్రాములు రావడం లేదా?" అని అడిగింది.

"ఏ ఛానెల్ తిప్పినా సినిమాలే! అవీ చెత్త సినిమాలు.., ఒకేరకం కథలు! మూతిపై మీసాలు కూడా రాని అబ్బాయి, ప్రియుడు తప్ప తల్లీతండ్రీ ఎవరూ కంటికి ఆనని అమ్మాయి, వీళ్ళ ప్రేమకథ, ప్రపంచంలో ప్రేమ తప్ప మరో ప్రాబ్లమ్ లేనట్టు... పెళ్ళిచేసుకోవడం తప్ప మరో గోల్ లేనట్లు..! ఇలాంటి సినిమాలు యువతరంపై ఎంతటి చెడుప్రభావం చూపిస్తాయో వీళ్ళకి అర్థంకావడం లేదు."

"సినిమాని సినిమాగా చూడాలి. మీరు మరీ విపరీతంగా ఆలోచిస్తున్నారు."

"సినిమా చాలా పవర్‌ఫుల్ మీడియా! చక్కగా వాడుకుంటే ఎంత లాభమో- యువతరాన్ని నిద్రపుచ్చే ఇలాంటి సినిమాల వల్ల సమాజానికీ, దేశప్రగతికీ అంత నష్టం కలుగుతుంది."

ఆరోజు రాత్రి ఎనిమిది గంటలైనా కూతురు ఇంటికి రాకపోయేసరికి భార్యను అడిగాడు-

"అమ్మాయి మ్యాథ్స్ ట్యూషన్‌కు వెళుతూందండీ! ఒక్కోసారి రావడానికి లేటవుతూంటుంది."

"ట్యూషన్ ఎక్కడ?"

"నాంపల్లిలో!"

"ట్యూషన్ కోసం మలక్‌పేట నుంచి నాంపల్లి వరకూ వెళుతూందా?"

"సిటీలో అది ఎంతదూరమండీ! పైగా- సన్నీలో వెళ్తుంది కదా... ట్యూషన్ కాగానే వచ్చేస్తుంది!"

"ఏవైనా గొడవలు, కర్ఫ్యూలు లాంటివి వస్తే ఇబ్బంది కదా! పగలైతే ఫర్వాలేదు... రాత్రిపూట అమ్మాయి అంతదూరం ఒంటరిగా వెళ్లిరావడం నాకు నచ్చలేదు."

"మీకు అన్నిటికీ భయపడటం అలవాటయిపోయింది!" అంది లక్ష్మి.

"నీకు ఆలోచనే లేకపోవడం అలవాటయిపోయింది!" విసుగ్గా అన్నాడు.

తొమ్మిదిన్నర అయినా కూతురు రాకపోయేసరికి- మళ్లీ భార్యను అడిగాడు-

"ఆ ట్యూషన్ మాస్టారి ఫోన్‌నెంబర్ ఉందా?"

"లేదండీ!"

"నీవు ఇంట్లో ఏం చేస్తున్నావు?" కోపంగా అడిగాడు.

"నాకు తోచలేదండీ! అదిగో... అమ్మాయి వస్తూంది!" అంటూ వెళ్లి గేటు తీసింది లక్ష్మి.

సన్నీని పోర్టికోలో పెట్టి, "ఏం డాడీ! నాకోసం వెయిట్ చేస్తున్నారా?" అని అడిగింది.

"ఇంత ఆలస్యమయిందేం?"

"రేపు మాథ్స్ టెస్ట్ ఉంది డాడీ! డౌట్లన్నీ తీర్చుకుని వచ్చేసరికి లేటయింది!"

భోంచేస్తూ అడిగాడు- "రమ్యా! ట్యూషన్లు చెప్పే మాస్టార్లు ఇంకాస్త దగ్గరగా ఎవరూ లేరా? నాంపల్లికి రోజూ వెళ్లిరావడం కష్టం కదూ..?!"

"ప్రయత్నించాను డాడీ! ఎవరూ దొరకలేదు."

"మీ మాస్టారు ఇంతసేపు ట్యూషన్స్ చెప్తూంటే అతని భార్య అతన్నేమీ అనదా?"

"లేదు. ఆవిడ ఎంతో సహనంతో అడ్జస్ట్ అయిపోతూంటుంది. ఇంకా పాపం... మాకు నీళ్లు, అప్పుడప్పుడు కాఫీలు కూడా ఇస్తూంటుంది!"

"మలక్‌పేట నుండి నీవొక్కదానివే వెళ్తావా?"

"లేదు. నా ఫ్రెండ్ రజని, మా క్లాస్‌మేట్స్ సందీప్, శంకర్... అందరం దాదాపుగా కలిసే వెళ్తాం!"

"వెరీగుడ్! మీ మాస్టారి పేరు, ఫోన్‌నెంబరు నా డైరీలో వ్రాసిపెట్టు. ఎప్పుడైనా నీవు రావడం లేటైతే మేం ఫోన్‌చేసి కనుక్కోవచ్చు. దీనివల్ల మా ఇద్దరికీ టెన్షన్ తగ్గుతుంది."

"అలాగే డాడీ!"

తర్వాత అమెరికా కబుర్లు చెప్పాడు పిల్లలకి. వాళ్ళు చదువుకోవడానికి తమ గదుల్లోకి వెళ్లాక లక్ష్మి అంది–

"ఎంత తెలివిగా కూపీలు లాగారండీ..?"

"పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో, ఏం చేస్తున్నారో తెలుసుకోవడం మన బాధ్యత!" అన్నాడు ప్రసాదరావు.

• • •

కోఠీలో షాపింగ్ చేస్తున్న ప్రసాదరావు దంపతులకు రజని కన్పించింది.

"ఏమ్మా రజనీ... బాగున్నావా? ట్యూషన్‌కి వెళ్లలేదా ఈరోజు?" లక్ష్మి పలకరించింది.

"ట్యూషన్ సార్ ఊళ్లో లేరు ఆంటీ! తన మరదలు పెళ్ళికని ఫ్యామిలీతో బెంగుళూరు వెళ్లారు."

"ట్యూషన్ లేదా? మరి రమ్య ట్యూషన్‌కని వెళ్లిందే..?!" ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"ప్రాబ్లెమ్స్ వర్కవుట్ చేసుకోవడానికి వెళ్తుంటుంది!"

"ఎవరున్నారు ఆ ఇంట్లో చెప్పడానికి?" ప్రసాదరావు అడిగాడు.

"మామూలుగా రమ్య, సింధూరి, మనోజ్, సందీప్‌లు మాస్టారు ఉన్నా, లేకపోయినా ప్రాబ్లెమ్స్ వర్కవుట్ చేసుకుంటూ, డౌట్స్ క్లియర్ చేసుకుంటూ వుంటారు."

"మరి, ఆ ఇంటి తాళం చెవి..?"

"మనోజ్ రాత్రుళ్ళు ఆ ఇంట్లోనే పడుకుంటాడు కాపలాగా! అందువల్ల కీ అతని దగ్గరే ఉంటుంది."

"మాకా ఇల్లు చూపిస్తావా..? ట్యూషను లేదని తెలిసుంటే రమ్యను కూడా షాపింగ్‌కి పిలుచుకొని వచ్చేవాళ్ళం!" అన్నాడు ప్రసాదరావు.

కారుని రజని చెప్పిన ఇంటిముందు నిలిపి తలుపు తోశాడు.

హాల్లో రమ్య, మరో ఇద్దరు అబ్బాయిలు చదువుకుంటున్నారు. మరో అమ్మాయి వంటింట్లో నుంచి కాఫీ ట్రేతో హాల్లోకి వచ్చింది.

"రమ్యా! మీ మమ్మీ, డాడీ..!" అంది ఆ అమ్మాయి.

రమ్య ఆశ్చర్యంగా తలెత్తి చూసి, లేచి తల్లిదండ్రుల్ని లోపలికి ఆహ్వానించి తన ఫ్రెండ్స్‌ని పరిచయం చేసింది.

"రమ్య చాలా ఇంటెలిజెంట్ అంకుల్! చదువులో చాలా సిన్సియర్!" అన్నాడు మనోజ్.

"వెరీగుడ్! రమ్యా... షాపింగ్ కెళ్దాం... వస్తావా?" అన్నాడు ప్రసాదరావు.

రమ్య 'అలాగే'నంటూ పుస్తకాలు సర్దుకుని లేచింది.

"నీవూ వచ్చేటట్లయితే రామ్మా! నిన్ను ఎక్కడ డ్రాప్ చేయాలో చెప్తే డ్రాప్ చేస్తాను!" అన్నాడు సింధూరితో. ఆమెను అక్కడ ఒంటరిగా వదలడం అతనికి ఇష్టంలేకపోయింది.

ఆ అమ్మాయి తను కూడా వీళ్ళతో బయలుదేరింది.

ఆరాత్రి రమ్యను మందలించింది లక్ష్మి.

"ఈరోజు నీవు చేసింది నాకేం నచ్చలేదు రమ్యా! ట్యూషన్ ఉందని అబద్ధం చెప్పి వెళ్లావు..!"

"అమ్మా! ఎల్లుండి నుంచి మాకు గ్రాండ్‌టెస్ట్‌లు మొదలవుతాయి. ఇంకా ఎంతో నేర్చుకోవాల్సి వుంది. సమయానికి మాస్టారు ఊర్లో లేరు. అందుకే మేం నలుగురం అక్కడే కూర్చుని ప్రాబ్లమ్స్ సాల్వ్ చేసుకోవాలనుకున్నాం. అక్కడికి వెళ్లాక నేను ఒక నిమిషం కూడా వేస్ట్ చెయ్యలేదు తెలుసా? పైగా... ముందే మాస్టారు లేరని చెప్తే నీవు పంపించేదానివా?"

"నిజమేనమ్మా! కాని, నిజం చెప్పడమే మంచిది. లేకుంటే పరాయివాళ్ళ ద్వారా వింటే మాకూ, నీకూ కూడా అవమానమే!"

"మీకు అవమానం కలిగే పనులేవీ నేను చెయ్యనమ్మా!"

ప్రసాదరావు కల్పించుకుంటూ–

"చూడు రమ్యా! మాకు అవమానం కలిగేలా నీవు ప్రవర్తిస్తావని మేము అనడం లేదు. నీ తెలివితేటల పైనా, క్రమశిక్షణ పైనా మాకు పూర్తి నమ్మకం ఉంది. కాని, కాలమే బాగాలేదు. ఎప్పుడూ మన జాగ్రత్తలో మనముండాలి. ముఖ్యంగా వయసులోవున్న ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలి. ఈ వయసులో మీకు అందరూ మంచివాళ్ళలాగే కన్పిస్తారు. కాని, మేకవన్నె పులులు కొన్ని ఉంటే, కొన్ని మేకలే పులులుగా మారుతాయి... అవకాశం వస్తే! అందుకే మీరు ఎలాంటి అవకాశాలకీ తావివ్వకూడదు."

"మరి, నలుగురితో కలవకుండా నాలెడ్జ్ ఎలా పెరుగుతుంది డాడీ?"

"నీ ఫ్రెండ్స్‌ని కలవొద్దని నేను చెప్పానా? మీరు కలిసే ప్రదేశాలు సురక్షితమైనవిగా ఉండాలి. మనింట్లోనే హాయిగా కలిసి చదువుకోండి. జనసంచారం ఉండే ప్రాంతాల్లో కలిసి తిరగండి. రద్దీగా వున్న గుడిప్రాంగణంలో గంటసేపు హాయిగా మాట్లాడుకోండి. మేము ఉంటే మీకు అసౌకర్యంగా ఉంటుందని మాకు తెలుసు. అందుకే మీపై మా నిఘా మాత్రమే వుంటుంది గాని, మీకు అడ్డుగా మేము వుండము!" అన్నాడు ప్రసాదరావు.

"కాని, మేము ఆరుగురం ప్రాణస్నేహితుల్లా కలిసిపోయాం. ఇప్పుడు 'వాళ్ళు మగవాళ్ళు' అనే కారణం వలన వారిని దూరంగా ఉంచలేను."

"నీవు ఇంతచెప్పినా ఇంకా అర్థంచేసుకోవడం లేదు రమ్యా! నిన్ను స్నేహం వదులుకోమని నేను చెప్పలేదు. కాస్త జాగ్రత్తగా ఉండమని చెప్పానంతే!"

"మీరు చెప్పినట్లే ఇకపై ఎక్కడికీ వెళ్లను డాడీ!" అంటూ కళ్ళనీళ్లతో తన గదిలోకి వెళ్లిపోయింది రమ్య.

ఆ తర్వాత రెండురోజులు తల్లిదండ్రులతో మాట్లాడలేదు రమ్య.

ప్రసాదరావుకి చాలా బాధగా, అనీజీగా అన్పించింది. ఒకవేళ తనే ఎక్కువగా ఆలోచించి రమ్యను ఇబ్బంది పెడ్తున్నాడా? లేక, అందరు తండ్రులూ ఇలాగే ఫీలవుతున్నారా? ఈకాలం పిల్లలకు హితం చెబితే కోపం! అలాగని వదిలేస్తే- రేపు వారికేదైనా జరిగితే వాళ్ళకంటే ఎక్కువ బాధ తల్లిదండ్రులకే!

వారంరోజుల తర్వాత మళ్లీ ఇంట్లో మామూలుగా మాట్లాడసాగింది రమ్య.

• • •

ఎంసెట్ పరీక్ష ఇంకో పదిరోజులుండనగా- రమ్యకు జ్వరం వచ్చింది.

రెండురోజుల తర్వాత తగ్గింది.

అయితే... టెన్షన్ ఎక్కువగా ఉండటంతో రోజురోజుకీ నీరసించిపోసాగింది.

ఒకరోజు ప్రసాదరావు తన ఫ్రెండ్ ఒకతను డాక్టరని, అతని దగ్గరికి పోయివద్దామని కూతుర్ని బయలుదేరదీశాడు.

కారులో పోతూ- "రమ్యా! నా ఫ్రెండు డాక్టరని చెప్పానే- అతను ఫిజీషియన్ కాదు... సైకియాట్రిస్టు!" అన్నాడు.

"ఇప్పుడు సైకియాట్రిస్టు దగ్గరికి ఎందుకు డాడీ?"

"నీ టెన్షను తగ్గించడానికి! అతను కౌన్సిలింగ్ గాని, సైకోథెరపీ గాని చెయ్యవచ్చు. దానివల్ల టెన్షన్‌తో నీ పరీక్ష పాడుచేసుకొనే అవకాశం ఉండదు."

తన ఫ్రెండు రమేష్‌కి కూతుర్ని పరిచయం చేసి, ఆమె సమస్య గురించి చెప్పాడు.

రమేష్ రమ్యని కౌన్సిలింగ్ చేసి మందులు రాసిచ్చాడు.

"మందులు చాలా మైల్డ్‌డోస్‌లో ఇస్తున్నాను. పరీక్ష రాశాక నిలిపి వెయ్యవచ్చు. జీవితంలో ఎన్నో సమస్యలు, సవాళ్ళు ఎదురవుతుంటాయి. అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కోవడం అలవాటు చేసుకోవాలి. ఎంసెట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకోవాలనుకోవడం తప్పు కాదు. కాని, ఎంసెట్టే జీవితం అనుకోకూడదు. తెలివిగలవాళ్ళకు అవకాశాలు ఎప్పుడూ ఉంటాయి!" అన్నాడు రమేష్.

అతనికి 'థాంక్స్' చెప్పి, "ఇక, మేం వస్తాం..!" అన్నాడు ప్రసాదరావు.

"అలాగే! రమ్యా... నీవు రెండురోజుల తర్వాత నాకు ఒకసారి ఫోన్‌చేసి మందులు వాడాక ఎలావుందో చెప్పు. నీ ఎంసెట్ పరీక్ష అయ్యాక మాత్రం ఒకసారి నన్ను కలువు!"

"అలాగే అంకుల్!" అంది రమ్య.

ఎంసెట్ పరీక్ష రాసిన తర్వాత రమ్య డాక్టర్ రమేష్‌కి ఫోన్‌చేసి పరీక్ష బాగా రాశానని చెప్పింది. మరుసటిరోజు రమ్యని అప్పాయింట్‌మెంట్ ఇచ్చాడు రమేష్.

తండ్రితోపాటు డాక్టర్‌ని కలిసింది రమ్య.

"నేను అనుకున్నదానికంటే బాగా రాశాను అంకుల్! మీకు చాలా థ్యాంక్స్!" అంది కృతజ్ఞతగా.

"వెరీగుడ్! నీవు బాగా రాయడమే మాకు కావాల్సింది! ఈమధ్య సమాజంలో కొత్తకొత్త సమస్యలు ఉత్పన్నం కావడంతో ఎక్కువమందికి మానసిక అలజడి కలగడం జరుగుతోంది. పిల్లల చదువుల దగ్గర్నుంచీ ఉగ్రవాదుల ఉన్మాదం వరకూ ఎన్నో సమస్యలు, ఇబ్బందులు,

అపాయాలు! వీటిని తట్టుకోవాలంటే మానసిక బలం కావాలి. అది లేనివాళ్ళు తప్పనిసరిగా సైకియాట్రిస్ట్‌ని కలవాలి. నిన్ను ఇక్కడికి పిలుచుకొనివచ్చి మీ నాన్న చాలా మంచిపని చేశాడు!" అన్నాడు రమేష్.

ఇంతలో నర్స్ వచ్చి, "సార్! ఆశా వాళ్ళు వచ్చారు!" అని చెప్పింది.

"అక్కడ కూర్చోబెట్టు!" అంటూ ఎదురుగా ఉన్న బెంచీని చూపెట్టాడు.

ఒక నిమిషం తర్వాత ఓ ఇరవై ఏళ్ల అమ్మాయి లోపలికి వచ్చింది. ఆ అమ్మాయి చాలా అందంగా వుంది. అయితే... ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్లు నడిచి వచ్చి బెంచీపై కూర్చుంది.

"మిమ్మల్ని పదినిముషాల్లో పిలుస్తాను. బయట కూర్చోండి!" ఆమె తల్లిదండ్రులతో అన్నాడు రమేష్.

తర్వాత ప్రసాదరావుతో– "ఆ అమ్మాయి బి.టెక్. చదువుతోంది. చాలా చురుకుగా ఉండేది. అయితే– ప్రపంచంలో మంచే తప్ప చెడు ఉండదని అనుకొంది. ఆమెతో ఎంతో స్నేహంగా ఉండే ఫ్రెండ్స్ వ్యూహం పన్ని ఆమెని రేప్ చేశారు. ఆ షాక్‌తో ఆమె మతిస్థిమితం కోల్పోయింది."

"మైగాడ్! ఆమెకి నయమవుతుందా?" ప్రసాదరావు అడిగాడు.

"అవకాశాలున్నాయి. నేను ఈ కేసుని ఓ ఛాలెంజ్‌గా తీసుకుని చేస్తున్నాను."

రమ్య ముఖంలో భావాల్ని చదివిన రమేష్– ఆమె తను చెప్పింది విని భయపడుతోందని గ్రహించాడు.

"సమస్యల్ని చూసి భయపడకూడదు. మనం అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి అవకాశాలకీ తావివ్వకూడదు. మనుషుల్ని నమ్మాలి కాని, గుడ్డిగా నమ్మకూడదు. నీ తల్లిదండ్రుల సలహాలు పాటిస్తే ఏ సమస్యా ఉండదు. ఎందుకంటే– వాళ్ళు అనుభవజ్ఞులు, నీ మేలు కోరేవారు కనుక! జరిగాక బాధపడటం కంటే ముందే జాగ్రత్తగా ఉంటే హాయిగా ఉండొచ్చు. ఐ విష్ యు ఎ బ్రైట్ ఫ్యూచర్..!" రమ్యకి చేయందిస్తూ అన్నాడు రమేష్.

అతనికి 'థ్యాంక్స్' చెప్పి శెలవు తీసుకున్నారు రమ్య, ప్రసాదరావు.

మరుసటిరోజు నుండి రమ్య తండ్రి చెప్పినవిధంగానే నడుచుకోసాగింది. స్నేహితులను ఇంటికే పిలిపించుకొని సెలవులు ఎంజాయ్ చేయసాగింది.

ఒకరోజు ప్రసాదరావు రమేష్‌కి ఫోన్‌చేసి థాంక్స్ చెప్తూ– "అమ్మాయిలో మార్పు వచ్చింది. నేను చెబితే అర్థంకానిది– నీ పేషంట్‌ని చూశాక తనకి అర్థమయ్యింది!" అన్నాడు.

"నీవు రమ్య గురించి చెప్పాక నేను ఆ విషయం గురించే ఆలోచిస్తూ ఉన్నాను. తర్వాత నీవు రమ్యని క్లినిక్‌కి పిలుచుకొని వచ్చినప్పుడు నాకీ ఆలోచన వచ్చింది. రమ్యకి అప్పాయింట్ మెంట్ ఇచ్చిన టైముకే ఆశా వాళ్ళనీ రమ్మన్నాను. నిజానికి– మనం రేప్ సంఘటనల గురించి పేపర్లో చదువుతూంటాం. కాని, ఆ విక్టిమ్‌ని ప్రత్యక్షంగా చూస్తే కలిగే ప్రభావం వేరు. ఇంతకీ... నేనొక నిజం చెప్పనా? ఆశా మతిభ్రమించడానికి కారణం రేప్ కాదు... అత్తామామల చిత్రహింసలు! ఆమెని రమ్య విషయంలో ఉపయోగించుకొని సక్సెస్ అయ్యాను!"

"చాలా తెలివిగా ఆలోచించావు. నీవల్ల నాకు ప్రాబ్లెమ్ సాల్వ్ అయింది!" అన్నాడు ప్రసాదరావు ఆనందంగా.